భారత రాజ్యాంగంపై ప్రతిజ్ఞ

కాచిగూడ: భారతరత్న డా. బీఆర్.అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం కాచిగూడ చెప్పల్‌బజార్‌లోని సెయింట్ మీరా హైస్కూల్‌లో బీజేపీ నేతలు భారత రాజ్యంగంపై స్కూల్ పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు శ్యామ్‌రావు, బల్వీర్, శీర్‌సాగర్, శ్రీకాంత్, కృష్ణకుమార్, సభాష్ పటేల్, ఆరవింద్, వినోద్‌యాదవ్, వాసు, లక్ష్మణ్, బి.భీమ్‌రాజ్, వాసు, శివకుమార్, ఎం.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

నల్లకుంట: శివానంద్‌నగర్‌కు చెందిన ఎం.భాస్కర్‌యాదవ్ యాదవ సంఘం అంబర్‌పేట నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. గురువారం సంఘం చైర్మన్ నందకిషోర్‌యాదవ్, పాండుయాదవ్, కన్నె రమేష్ యాదవ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గ్రేటర్ నాయకులు లడ్డుయాదవ్, మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ప్రజలు భూస్థాపితం చేస్తారు

సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ నాయకులకు విలువలు, గౌరవం గురించి తెలియదని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి ఆరోపించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించినా కూడా ఆపార్టీకి బుద్ధి రాలేదని ఆయన ఎద్దేవ చేశారు. ప్రజల కోసం కిషన్‌రెడ్డి పనిచేస్తున్నారని, అటువంటి వ్యక్తిని విమర్శించడం తగదని దీపక్‌రెడ్డి హెచ్చరించారు. సికింద్రాబాద్ ఎంపీగా, కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఈ నియోజకవర్గానికి అనేక నిధులను తీసుకొని వచ్చారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ప్రవర్తనను మార్చుకోకపోతే ప్రజలు ఆపార్టీని భూస్థాపితం చేస్తారన్నారు.

రాజ్యాంగ కరపీఠిక పత్రాల పంపిణీ



రాజ్యాంగ కరపీఠిక కరపత్రాన్ని బస్తీ అధ్యక్షురాలికి అందజేస్తున్న వర్మాల శ్రీకాంత్

నల్లకుంట: బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం అంజయ్యనగర్‌లో భారత రాజ్యాంగ కరపీఠిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీవాసులకు కరపీఠిక పత్రాలను పంపిణీ చేసి రాజ్యంలో పొందుపర్చిన హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వర్మాల శ్రీకాంత్, ఎంటీ కిశోర్‌కుమార్, కేజే బాబు, మధుసూదన్, శివకుమార్, ప్రశాంత్‌జోషి, క్రాంతి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణం కోసం చెట్టు నరికివేత

కవాడిగూడ: డివిజన్‌లోని ఎల్‌ఐసీకాలనీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్‌నగర్‌లో ఓ ఇంటి యజమాని ఇంటి నిర్మాణం పేరుతో గురువారం చెట్టును నరికి వేయించారు. అనుమతి లేకుండా వేపచెట్టును నరికివేసిన ఇంటి యజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాలికతో వ్యక్తి అసభ్య ప్రవర్తన

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

కాచిగూడ: ఓ బాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌పై కాచిగూడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పుర లింగంపల్లి ప్రాంతానికి చెందిన రాములు కుమారుడు ఎస్.ఆంజనేయులు (46)ఆటో డ్రైవర్. స్కూల్ పిల్లలను తీసుకెళ్తూ ఉంటాడు. ఓ బాలిక (13)పట్ల ఆటో డ్రైవర్ అసభ్యంగా వ్యవహరించడంతో బాలిక ఇంట్లో తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.గురువారం ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆటో చోరీ కేసులో ఇద్దరికి ఏడాది జైలు

చిక్కడపల్లి: ఆటో దొంగిలించిన నేరం నిరూపితం కావడంతో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష పడింది. చిక్కడపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గతేడాది నవంబర్‌లో చిక్కడపల్లిలోని సాయి బార్ అండ్ రెస్టారెంట్ వద్ద పార్కింగ్ చేసిన రెంటల్ ఆటో చోరీకి గురైంది. ఆటో యజమాని ప్రేమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేశారు. ఆటోను దొంగలించిన కుర్మరాజు, చాకలి బాలరాజును గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. నవంబర్ 20, 2024 రోజున నాంపల్లి కోర్టులో హాజరు పరచగా కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కి తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ రోజు నాంపల్లి కోర్టు మెజిస్ట్రేట్ నిర్మల వారికి ఏడాది జైలు శిక్ష విధించారు.

టీఆర్టీ కాలనీ షటిల్ కోర్టు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ పక్కన పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించిన దృశ్యం





స్పందించారు.. తొలగించారు.!

సాక్షి ఎఫెక్ట్..

● ఎట్టకేలకు స్పందించిన అధికారులు ● పేరుకుపోయిన చెత్తకుప్పల తొలగింపు



గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనం

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో డెబ్రిస్ పాయింట్ల వద్ద రోజుల తరబడి వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. స్థానికులు పలుమార్లు పారిశుద్ధ్య సిబ్బందికి విజ్ఞప్తి చేసిన డెబ్రిస్ తొలగించకుండా చెత్తను తరలించే కాంట్రాక్టు దక్కించుకున్న రాంకీ సంస్థ సిబ్బంది నిర్లక్ష్యం వహించారు. దీంతో స్థానికులు సమస్యను సాక్షి దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో సమస్యపై గురువారం 'పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం'శీర్షికన సాక్షి పత్రికలో కథనం ప్రచురితం కావడంతో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించారు. వెంటనే రాంకీ సిబ్బందిని పురమాయించి వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాల కుప్పలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. నెలల తరబడిగా ఉన్న సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన 'సాక్షి'కి టీ ఆర్టీకాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా వ్యర్థాలను పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కుప్పగా పోగు చేశారని, ఆ కుప్పను కూడా అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే అక్కడ వ్యర్థాలు మరింతగా పేరుకుపోయే అవకాశం ఉందంటున్నారు.





టీ ఆర్టీ కాలనీ షటిల్ కోర్టు మెయిన్ గేట్ ఎదురుగా వ్యర్థాలను తొలగించిన దృశ్యం

25 నుంచి పూలే, అంబేడ్కర్‌ల జనజాతర సభలు



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కేవీపీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న టి. స్కైలాబ్ బాబు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత రాజ్యాంగ రక్షణకు అందరూ ఐక్యం కావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. ఏప్రిల్ నెలను మహనీయుల మాసంగా పాటిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా ఈనెల 25 నుంచి పూలే, అంబేడ్కర్ జన జాతర సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కుల వివక్షతపై ప్రత్యక్ష ప్రతిఘటన ఉద్యమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా కేవీపీఎస్ కొన్నేళ్లుగా ఉద్యమాలు చేస్తోందన్నారు. దేశాన్ని ఏలుతున్నా బీజేపీ మనువాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ పదకొండేళ్ల పాలనలో దళితులపై 300 రెట్లు దౌర్జన్యాలు పెరిగాయని తెలిపారు. కేవీపీఎస్ నగర అధ్యక్షుడు ఎం.దశరథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుబ్బారావు, కృపాసాగర్, అశోక్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో నిర్లక్ష్యం తగదు

కాచిగూడ: ప్రజలు ఎప్పటికప్పుడు ఆరోగ్య సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ పబ్లిక్ హెల్త్ ట్రైనింగ్ రిసెర్చ్ (ఎన్ఐపీహెచ్‌టీఆర్) ముంబాయి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శుభాంగి భావిష్కర్ అన్నారు. గురువారం కాచిగూడ, ఖాజాగరీబ్ నగర్‌లో ఆరోగ్యంపై అవగాహన సదస్సు, మధుమేహంపై హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్లక్ష్యం, అవగాహన లోపం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఎక్స్‌టెన్షన్ మీడియా ఆఫీసర్ డి. వసంతరావు, డిప్లొమా ఇన్ హెల్త్ ప్రమోషన్ ఎడ్యుకేషన్ ట్రైనీస్ చీర్ల రాధా, బి.కలమ్మ, లక్ష్మణ్, జ్ఞానేశ్వర్, యాదగిరి, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడలో జరిగిన ఆరోగ్య అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శుభాంగిణి

ప్రేక్షకరంజకం.. పౌరాణిక పద్యనాటకం



చిక్కడపల్లి: కల్పనా కళానికేతన్ ఆధ్వర్యంలో రాష్ట్రం చలనచిత్ర నాటక రంగ అభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో పౌరాణిక పద్యనాటక ప్రదర్శన ప్రేక్షక రంజకంగా సాగింది. శ్రీకృష్ణ రాయబారంలోని కర్ణ సందేశం, సత్యహరిచంద్రలోని కాటి దృశ్యాలను కళాకారులు పాత్రోచితంగా నటించి ప్రదర్శనను రక్తికట్టించారు. శ్రీకృష్ణుడిగా వేదవ్యాస వెంకటేష్, కర్ణుడిగా దొంతి జంగయ్యగౌడ్, సత్యహరిశ్చంద్రుడిగా జె.శ్రీనివాస్ నటించారు. విశ్రాంత న్యాయమూర్తి నాగమారుతి శర్మ ముఖ్యఅతిథిగా హాజరై కళాకారులను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, ప్రముఖులు శ్రీనివాసరావు, అయోధ్య రామయ్య, భాస్కర్‌రావు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చిక్కడపల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గురువారం రాత్రి చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం... ఆర్టీసీ క్రాస్‌రోడ్డు మెట్రోస్టేషన్ కింద మెట్ల వద్ద ఫుట్‌పాత్‌పై వ్యక్తి పడిపోయి ఉన్నాడు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. అతడి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడిని గుర్తిస్తే ఫోన్ నం.87126 60160లో సంప్రదించాలని కోరారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం

ముషీరాబాద్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఐసీడీఎస్ ముషీరాబాద్ సెక్టార్ సూపర్‌వైజర్ జి.జ్యోతి సూచించారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సికింద్రాబాద్ ప్రాజెక్టు ముషీరాబాద్ సెక్టార్ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. తప్పనిసరి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. అప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో జె.స్వప్న, అంగన్‌వాడీ టీచర్‌లు భాగ్యరేఖ, పద్మాబాయి, ఉమాదేవి, ప్రమీల, జ్యోతి, అలివేలుమంగ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ముషీరాబాద్ సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి

పౌష్టికాహారం తీసుకోవాలి



బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ లారా మీనస్

ముషీరాబాద్: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డాక్టర్ లారా మీనస్ అన్నారు. గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో విద్యార్థినులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లారా మీనస్ మాట్లాడుతూ... ప్రతి రోజు వ్యాయామంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రతినిధులు శ్రీదేవి, ప్రజ్ఞా, రెయిన్‌బో హోం ఇన్‌చార్జి సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



కవాడిగూడ: హనుమాన్ జయంతి ముగిసిన ఐదు రోజుల తరువాత ప్రతి సంవత్సరం కవాడిగూడ కామునికుంతలోని శ్రీబాలంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. గురువారం జరిగిన ఈ పూజలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, కె.పరిమళ్‌కుమార్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వారు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్ బాబు, ప్రభాకర్ గంగపుత్ర, శ్రీనివాస్‌ముదిరాజ్, శివరాజ్, డి.శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



అంబర్‌పేట: అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన వి.ఫణీంద్రకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రూ. 35 కోట్లతో ఉపకరణాల కొనుగోలు

చాదర్‌ఘాట్: రాష్ట్రంలోని దివ్యాంగులకు ఉపకరణాల కొనుగోలుకు సహకార సంస్థకు ప్రభుత్వం రూ. 35 కోట్లు కేటాయించినట్లు వికలాంగుల సహకార సంస్థ అధికారులు తెలిపారు. ఈ టెండర్లలో మోటరైజ్‌డ్ వాహనాలు 2000, బ్యాటరీ వాహనాలు 5000, ల్యాప్‌టాప్స్ 1000, ఎలక్ట్రికల్ బ్యాటరీ వాహనాలు 50, వ్యాపార వాహనాలు 600 ఈ ఉపకరణాలకు టెండర్లు పూర్తయినట్లు తెలిపారు. కొనుగోలు అనంతరం రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అర్హులను జిల్లా స్థాయిలో కమిటీ ద్వారా ఎంపిక చేస్తారని ఈ ప్రక్రియ పూర్తి కావడానికి దాదాపు రెండు నెలల సమయం పడుతుందన్నారు.

జడ్జిల నియామకాల్లో బీసీలకు అన్యాయం

కాచిగూడ: జూనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ జడ్జి పరీక్ష రాసే బీసీలకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ జూనియర్ అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల వంశీకృష్ణ అన్నారు. జూనియర్ అడ్వొకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు కాచిగూడలోని అసోసియేషన్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి హైకోర్టు గేటు ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూనియర్ సివిల్ జడ్జి, (జేసీఐ), డిస్ట్రిక్ట్ జడ్జి (డీజే) నియమాకాల్లో బీసీ అభ్యర్థులకు వ్రాత పరీక్ష, వైవా–వోస్ కనీస కటాఫ్ మార్కుల రిజర్వేషన్ లేకుండా నియమాలు పెట్టారన్నారు. నియమాలను సవరించి సామాజిక న్యాయం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌యాదవ్, అఖిల్, వంశీకృష్ణ, రాపోలు నవీన్, భరత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు జక్కుల వంశీకృష్ణ తదితరులు

బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు

అంబర్‌పేట: వినియోగదారులకు నాణ్యమైన సేవలందించే లక్ష్యంతో బీఎస్ఎన్ఎల్ సంస్థ పనిచేస్తోందని పీజీఎం ఏరియా–1 ఆర్.పవనమూర్తి అన్నారు. గురువారం బాగ్అంబర్‌పేట సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో వినియోగదారుల సర్వీస్ క్యాంపు నిర్వహించారు. క్యాంపులో వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపారు. సర్వీస్ క్వాలిటీ, మొబైల్ టారిఫ్‌లను వివరించి నూతన వినియోగదారులను చేర్చుకున్నారు. ఈ సందర్భంగా పవన మూర్తి మాట్లాడుతూ... ఇతర నెట్‌వర్క్‌లతో పోలిస్తే ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ చౌకై ధరలకు అత్యుత్తమ సేవలు అందిస్తూ ప్రజాదరణ పొందుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఎం.నరసింహులు, ఏజీఎం ఎస్.మురళీకృష్ణ, జి.రాములు, ఎస్.గోపాల్‌రెడ్డి, సీఏఓ రత్న సదానంద్, ఎంటీ వి.జాహ్నవి, బీఎస్ఎన్ఎల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న పీజీఎం ఏరియా-1 ఆర్.పవనమూర్తి

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను తిప్పికొట్టాలి



బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గాథబోని రవి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను తిప్పికొట్టాలని అందుకు ప్రజా ఉద్యమాలను చేపట్టాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాథబోని రవి పిలుపునిచ్చారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 19న అమరజీవి ఎండీ గౌస్ నాల్గో వర్ధంతి సభను నిర్వహిస్తున్నమని తెలిపారు. ఏప్రిల్ 24 నుంచి మే 1 వరకు అమరవీరుల స్మారక వారోత్సవాలతో పాటు మే 9న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి 17వ వర్ధంతి సభను నిర్వహిస్తున్నమని చెప్పారు. మే 12న మచ్చాపూర్ స్మారక స్థూపం వద్ద ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకులు మద్దికాయల ఓంకార్ శత జయంతి సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లెపు ఉపేందర్‌రెడ్డి, వి.మట్టయ్య, కన్నం వెంకన్న, గొనె కూమరస్వామి, పెద్దరపు రమేష్, తుకార నాయక్, మంద రవి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

చిక్కడపల్లి: బాపు సేవక్ సమాజ్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి గురువారం బాపునగర్‌లో శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం వార్షికోత్సవ పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో వేదపండితులు హోమం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 6గంటలకు జరిగే ఊరేగింపు కార్యక్రమానికి కోలార్ నుంచి వీరభద్ర, సేవ వీర విన్యాసాలు చేస్తారని నిర్వాహకులు ఆలయ అర్చకులు ఆనంద స్వామి తెలిపారు. శనివారం శివపార్వతుల(గిరిజ) కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.



'ఈ మంచం నాది కాదు'

చిక్కడపల్లి: వంశీ ఆర్ట్ థియేటర్స్, రేలంగి ఆర్ట్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయ గానసభలో నిర్వహించిన హాస్య కదంబం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గోవిందరాజుల నాగేశ్వర్‌రావు రచించిన రాజగోపాల్ దర్శకత్వం వహించిన 'ఈ మంచం నాది కాదు'హాస్య నాటిక ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. అనంతరం జరిగిన సమావేశంలో నిర్మాత రేలంగి నరసింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొని కళాకారులను అభినందించి సన్మానించారు. నాటక రంగంలో ఉత్తమ ప్రదర్శనలను ఆదర్శించే ప్రేక్షకులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు సుబ్బరాయ శర్మ, వ్యాస కృష్ణ, టి.రామసత్యనారాయణ, వంశీ రామరాజు, ఆర్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిపక్షాల గొంతు నొక్కడానికే ఈడీ కేసులు

ముషీరాబాద్: నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌లో ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల పేర్లను నమోదు చేయడం ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యల్లో భాగమేనని ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్ మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు అన్నారు. గురువారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు మేరకు ఈడీ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాకు ముషీరాబాద్ నుంచి బిజ్జి శత్రు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే కాంగ్రెస్ నేతలపై ఈడీ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. దేశంలో రోజు రోజుకు కాంగ్రెస్ బలమైన శక్తిగా మారుతుండటంతో ఓర్వలేక బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ నేతలపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా బీజేపీకి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో దానిని కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ నేతలపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రజల కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్న సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ చార్జిషీట్‌లో నమోదు చేసిన పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము, బాలు, వెంకట్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ నుంచి ఈడీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు